క్లుప్తంగా

శ్రీజకు సాదర స్వాగతం



విమానాశ్రయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో దమ్ము శ్రీజ

గోపాలపట్నం: బిగ్‌బాస్ ఫేమ్ దమ్ము శ్రీజకు విశాఖ విమానాశ్రయంలో సోమవారం సాదర స్వాగతం లభించింది. అభిమానులు ఆమెను కలిసి స్వాగతం పలికారు. బిగ్‌బాస్‌లో వైల్డ్ కార్డు ద్వారా వచ్చి వారు చేసిన ఎలిమినేషన్‌లో ఆమె బయటకు వచ్చిన విషయం విదితమే. ఈ మేరకు బిగ్‌బాస్ హౌస్ నుంచి వచ్చిన సందర్భంగా జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు దంపతులు, తండ్రి దమ్ము శ్రీనివాసరావు తల్లి లావణ్యతో పాటు స్నేహితులు శాలువా కప్పి స్వాగతం పలికారు. దమ్ము శ్రీనివాసరావు మాట్లాడుతూ బిగ్‌బాస్ హౌస్‌లో 5 వారాల పాటు ఉండి.. తమ కుమార్తె చాలా మంది అభిమానులు మన్ననలు పొందిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

మల్కాపురం: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు మళ్లీ తిరగబెట్టే అవకాశం లేకుండా నయం చేయవచ్చునని గొంప నానాజీ అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో డిసీజ్ రివర్సల్ ఫ్యామిలీ మెంబర్స్ డే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మదన్‌బాగ్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె జబ్బులు, మధుమేహంతో బాధపడే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నానాజీ చెప్పారు. 50 మంది రోగులు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రఘురామ్,కల్యాన,ఝాన్సీలక్ష్మి,మహేష్,రాఘవలతో పాటు నాయకులు బొట్ట వెంకటప్పారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని కాకరల్లోవ, జయేంద్రకాలనీలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్పొరేటర్ గల్లా చిన్నా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలి



హెల్త్‌సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల కు మెరుగైన వైద్య సేవలు కల్పించే విధంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖ ర్ సూచించారు. ఏయూ డిస్పెన్సరీని సోమ వారం ఆయన సందర్శించారు. నూతనంగా నియమితులైన వైద్య, ఫార్మసీ, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. ప్రతీ విద్యార్థికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని సూచించారు. హెల్త్ సెంటర్‌లో ఉన్న వసతులు, అందిస్తున్న సేవలు పరిశీలించారు. సాధారణ వైద్యుల తోపాటు ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు సేవలు అందించడానికి అందుబాటులో ఉన్నట్లు ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ రామేశ్వర తెలిపారు. ఏయూ వైద్యశాలలో అందుబాటులో ఉన్న ఔషధాలను వీసీ పరిశీలించారు. అదనంగా ఏమి అవసరమైనా తెలియజేయాలని, వాటిని కొనుగోలుచేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. దివ్యాంగులు సైతం సులభంగా వచ్చేవిధంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఏయూ మహిళా హాస్టళ్లలో వైద్యులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్త పరీక్షలు జరిపే పరికరాల కొనుగోలుకు కొటేషన్లు 24 గంటల్లో సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రిజిస్ట్రార్ కె.రాంబాబు, డాక్టర్.రామేశ్వరమూర్తి పాల్గొన్నారు.

- సీబీఐతో విచారణ జరపాలి
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, పరిశీలకుడు చింతలపూడి
- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత
- నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నాయకుల ఆందోళన

కల్తీ మద్యంపై నిరసన హోరు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, పరిశీలకుడు చింతలపూడి తదితరులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గోపాలపట్నం: ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ,కల్తీ మద్యందందాపై సీబీఐ విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, ఆ పార్టీ నియోజకవర్గ రాజకీయ పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ నాయకుల నకిలీ మద్యం అమ్మకాలపై, విచ్చలవిడిగా వెలసిన బెల్టు దుకాణాల నిర్వహణపై సీబీఐతో విచారణ జరిపించి నిజాలను నిగ్గు తేల్చాలని కోరుతూ సోమవారం బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని 14 వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మళ్ల విజయ ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమ సంపద పెంచుకోవడం కోసం ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆరోపించారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలల్లో 400 మంది ప్రజలు కల్తీ మద్యం వల్లే మృతి చెందారని ఆరోపించారు. ఈ పాపం ఎవరిదని ప్రశ్నించారు.

కుటీర పరిశ్రమలా ..

కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నకిలీ, కల్తీ మద్యం దందా మొదలు పెట్టారని తేటతెల్లమవుతోందన్నారు. కొంతమంది టీడీపీ నాయకులు కుటీర పరిశ్రమగా తయారు చేసి నకిలీ మద్యం దందా సాగిస్తున్నారని విమర్శించారు. ఈ కేసును నీరుగార్చేందుకు ప్రభుత్వం కుతంత్రాలు చేస్తోందని అందుకే సిట్ వేస్తున్నామని ప్రకటించారని విమర్శించారు. ఈ సిట్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పని చేస్తారని.. వారి దర్యాప్తులో అసలు దోషులు బయటపడే అవకాశం ఉండదన్నారు. కేంద్ర సంస్థ అయిన సీబీఐ ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంపై బురద చల్లిన చంద్రబాబు ఇపుడు నకిలీ మద్యం నుంచి ఏవిధంగా బయటపడదామని కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు జరిగిన ఒప్పందాలన్నీ బయటకు రావాలన్నా, తయారీ దారుల వెనుక ఉన్న పెద్ద తలకాయలు బయటకు రావాలన్నా సీబీఐ చేత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, పశ్చిమ మహిళా అధ్యక్షురాలు పేడాడ జ్యోత్స్న, వార్డు కార్పొరేటర్లు పీవీ సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు,కిరణ్, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కుటుంబాలను కబళిస్తోంది



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు అధికంగా ఉండడంతో చాలా తక్కువ కొనుగోలు చేసుకుని తాగేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తక్కువ ధరకే విక్రయిస్తామని చెప్పి... నకిలీ మద్యాన్ని జనంలోకి విపరీతంగా డంప్ చేస్తుండడంతో చాలా మంది ఎక్కువగా తాగుతున్నారు. స్పిరిట్‌తో తయారు చేసిన నకిలీ మద్యం కావడంతో తాగిన వారు ఆస్పత్రి పాలవుతున్నారు. కూటమి పాలకులు మహిళల తాళిబొట్టులతో వ్యాపారం చేస్తున్నారు. ప్రజల జీవనంపై పాలకులకు చిత్తశుద్ధి ఉంటే విచ్చలవిడి మద్యం అమ్మకాలకు చెక్ పెట్టాలి.

– శ్రీదేవి వర్మ, వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు

నకిలీ మద్యం అమ్మకాలు అరికట్టాలి



రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల అండదండలతోనే కుటీర పరిశ్రమలా ఏర్పాటు చేసి నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారు. తాగిన వారి ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రుల పాలవడంతో చాలా కుటుంబాలు నడి రోడ్డు మీద పడుతున్నాయి. తక్షణమే కల్తీ మద్యం అమ్మకాలు అరికట్టాలి. నకిలీ మద్యం వ్యవహారంలో నిజాలను నిగ్గు తేల్చడానికి సీబీఐతో విచారణ చేయించాలి. జనావాసాలు, స్కూళ్లు, దేవాలయాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులు తొలగించాలి. – పేడాడ జ్యోత్స్న, వైఎస్సార్‌సీపీ పశ్చిమ మహిళా విభాగం అధ్యక్షురాలు

ట్యూటర్ ఏర్పాటు



ట్యూటర్‌ను పరిచయం హెచ్‌ఎం స్వర్ణలత

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యూటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ నేషల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష 8వ తరగతి విద్యార్థులు రాస్తారని తెలిపారు. వీరికి ఉపాధ్యాయులతో పాటు ట్యూటర్ ఉండడం వల్ల అదనపు సమయం వెచ్చించి చదివిస్తారని తెలిపారు. ఈ పరీక్ష పాసైతే ఏటా రూ.15వేల చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్, జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ నల్లజెండాలతో నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాదిగ పోరాట సమితి నాయకులు

మహారాణిపేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మాదిగ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అంజూరి దీపక్ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కింతాడ రాజశేఖర్ మాదిగ పర్యవేక్షణలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దళితుల ఆత్మగౌరవం – రాజ్యాంగ రక్షణ కోసం నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దీపక్ మాదిగ మాట్లాడుతూ సీజేఐపై దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణం కేసు నమోదు చేయాలన్నారు. రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ రాష్ట్ర రెల్లి సంఘం ఉపాధ్యక్షుడు పొడుగు కుమార్, నేషనల్ బాడీబిల్డింగ్ అధ్యక్షులు రాజారావు మాదిగ, కోరపల్లి నూకరాజు మాదిగ, బొడ్డు కిరణ్, పెట్ల ఈశ్వరరావు, రాజు, సిహెచ్.మంగ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన

రోడ్లు జలమయం

మల్కాపురం: ఆదివారం అర్ధరాత్రి నుంచి పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. చిరు జల్లులు మళ్లీ ఆగి భారీ వర్షపడింది. దీంతో పలు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. మల్కాపురం, శ్రీహరిపురం,నౌసేనాభాగ్,కోస్టుగార్డు,హెచ్‌పీసీఎల్ ప్రధాన గేటు వద్ద రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. పలు కాలువలు పొంగాయి. రోడ్లపై వర్షపు నీటితో పాటు వ్యర్థాలు నిలిచిపోవడంతో పాదచారులు,వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు.



ములగాడ సేవా మార్గం వద్ద బురద నీరు



వర్షానికి గొడుగే ఆధారం



నౌసేనాభాగ్ సేవా మార్గం వద్ద నిలిచిన వర్షపు నీరు

సిబ్బంది సమయపాలన పాటించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సిబ్బంది సమయపాలన పాటిస్తూ, విధులకు హాజరు కావాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ఆయన ఆకస్మికంగా పలు విభాగాలను తనిఖీ చేశారు. విభాగాల్లో సిబ్బంది సమయపాలన పాటించకపోవడం ఆయన దృష్టికి వచ్చింది. కార్యాలయ పనివేళల్లో సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని సూచించారు. పరిపాలనా భవనంలోని పలు కార్యాలయాల్లో సిబ్బంది అంతంతమాత్రంగా ఉండడం, పలువురు విధులకు ఆలస్యంగా హాజరుకావడం ఆయన దృష్టికి వచ్చింది. సంబంధిత కార్యాలయం సూపరింటెండెంట్లు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేజీహెచ్‌లో ఫుట్ స్కానింగ్ ప్రారంభం



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

మహారాణిపేట: ఫుట్ స్కానింగ్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి అన్నారు. సోమవారం కేజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీలో ఏపీ మెడిటెక్ జోన్ సహకారంతో వైద్యులకు, పోస్ట్-గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, పాదంలో బరువు ఎలా సమతుల్యంగా ఉందో దీని ద్వారా తెలుస్తుందన్నారు. ఈ సౌకర్యం ఇంతవరకు హైదరాబాద్‌లో మాత్రమే ఉందని, కానీ నేటి నుంచి విశాఖలో కూడా ఈ సౌకర్యం లభిస్తుందన్నారు. ఏపీ మెడిటెక్ జోన్ ద్వారా ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్ ద్వారా ఈ అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం. చంద్రశేఖరం నాయుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. మన్మధరావు, పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీ.ఎస్. చక్రవర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, ఇతర విభాగాల వైద్యులు, పీజీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 7 వినతులు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్(ఇన్‌చార్జి) శంకరరావు వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగుతోంది



కొత్తపాలెం యునైటెడ్ చర్చి వెనుక రోడ్డులోని ఖాళీ స్థలాల్లో చేరిన వర్షపు నీరు

గోపాలపట్నం: శివారు ప్రాంతాలు దోమలు కర్మాగారాలుగా మారుతున్నాయి. మౌలిక వసతులు లేకపోవడంతో మురుగు, వర్షపు నీరు ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నిలిచిపోతుంది. ఫలితంగా సమీప నివాసులు దుర్వాసనతో పాటు దోమలతో అవస్థలు పడుతున్నారు. అయినా మలేరియా విభాగం అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా జీవీఎంసీ 89వ వార్డులో పలు చోట్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. భగత్‌సింగ్‌నగర్, సాయిగణేష్‌నగర్, యునైటెడ్ క్రైస్ట్ చర్చి వెనుకభాగంలో రహదారులు కాల్వలు లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి పోతోంది. సాయంత్రం అయితే చాలు తలుపులు తెరవలేని పరిస్థితి ఉంటుందని వాపోతున్నారు. మలేరియా విభాగం అధికారులు ఇక్కడి పరిస్థితిని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖాళీ స్థలాల్లో చేరిన వర్షపు నీరు

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

సింథియా: ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వరకు నగరంలో జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని గొడౌన్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. డాక్‌యార్డ్ వద్ద గల గొడౌన్స్ వద్ద సోమవారం కార్మికులతో మహాసభల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత విశాఖ నగరంలో సీఐటీయూ మహాసభలు నిర్వహించడం తొలిసారి అని అన్నారు. మహాసభలను ప్రతి ఒక్క కార్మికుడు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ,రాష్ట్రంలో కూటమి సర్కార్ కార్మిక సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో పలు పరిశ్రమలు మూత పడుతున్నా.. కార్మికులను అన్యాయంగా తొలగిస్తున్నా పాలకులు నోరు మెదపడం లేదని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు,ఉపాధి కల్పనకు విశాఖ అభివృద్ధికి మూల స్తంభాలుగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు తదితర పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసేందుకు యత్నాలు సాగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఎందుకు కేంద్రాన్ని నిలదీయడం లేదని ఆయన ప్రశ్నించారు. సమావేశంలోయూనియన్ ప్రధానకార్యదర్శి ఎం. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అల్లు వెంకటరమణ, ఆఫీస్ బేరర్స్ దేవుడు బాబు, జి.నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.